క్లుప్తంగా

హోర్డింగ్స్, ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తే చర్యలు

మున్సిపల్ కమిషనర్ నాగేశ్వర్

మీర్‌పేట: కార్పొరేషన్ పరిధిలో అనుమతులు లేకుండా హోర్డింగులు, పోస్టర్లు, బ్యానర్లు ఏర్పాటు చేస్తే మున్సిపల్ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని మీర్‌పేట కమిషనర్ సీహెచ్.నాగేశ్వర్ మంగళవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. పట్టణ పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు భవనాలపై హోర్డింగులు, బ్యానర్లు ప్రదర్శించడాన్ని నిషేధించామని.. రాజకీయ పార్టీల ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, వ్యాపార సంస్థలు, ప్రకటనదారులు ఈ విషయాన్ని గమనించాలని సూచించారు. ప్రధాన కూడళ్లు, జాతీయ నాయకుల విగ్రహాల చుట్టూ బ్యానర్లు, ఇతర ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తే రాజ్యాంగ పరిరక్షణ చట్టం ప్రకారం చర్యలు తీసుకోవడంతో పాటు అట్టి ఫ్లెక్సీలను వెంటనే తొలగిస్తామన్నారు. గడువు ముగిసిన హోర్డింగ్‌లను వెంటనే తొలగించాలని కమిషనర్ సూచించారు.

ప్రారంభించిన పనులకు శంకుస్థాపనలా..?

కార్పొరేటర్ శ్రీవాణి

హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్ డివిజన్‌లో రోడ్డు నిర్మాణం పనులు ప్రారంభమైన వారం రోజులు తరువాత మంత్రి సబితారెడ్డి శంకుస్థాపన చేయడం ఏమిటని కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి ప్రశ్నించారు. మంగళవారం సరూర్‌నగర్ డివిజన్ పరిధిలో రూ.1.86 కోట్ల నిధులతో చేపట్టిన పనులకు మంత్రి సబితారెడ్డి శంకుస్థాపన చేశారు. ఎప్పుడో ప్రారంభమైన పనులకు మంత్రి శంకుస్థాపన చేసుకుని ప్రచారం చేసుకుంటున్నారని కార్పొరేటర్ ఒక ప్రకటనలో ఎద్దేవా చేశారు.

మత్స్యకారుల హక్కుల పరిరక్షణకు కృషి

మత్స్యకార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహా



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్ మల్లేశ్

మీర్‌పేట: మత్స్యకార్మిక సంఘం జిల్లా క్యాలెండర్‌ను మంగళవారం మీర్‌పేట కార్పొరేషన్ 36వ డివిజన్ కార్పొరేటర్ ఎద్ల మల్లేశ్ ముదిరాజ్ తన నివాసంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోరెంకల నర్సింహతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మత్స్యకారుల హక్కుల పరిరక్షణకు సంఘం నిరంతరం కృషి చేస్తోందన్నారు. జిల్లాలో కబ్జాలకు గురవుతున్న చెరువులు, కుంటలను రక్షించుకునేందుకు సంఘం చేస్తున్న పోరాటాన్ని కార్పొరేటర్ మల్లేశ్ అభినందించారు. ఈ కార్యక్రమంలో సంఘం బాలాపూర్ మండల ప్రధాన కార్యదర్శి నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

తలకొండపల్లి: మండల పరిధిలోని గట్టుఇప్పలపల్లికి చెందిన చిట్టమ్మ (58) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందింది. బీఆర్‌ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్‌రెడ్డి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.3,000 ఆర్థికసహాయం అందజేశారు. కార్యక్రమంలో రాజు, జంగయ్య, మల్లేశ్, శ్రీను, విజయ్, కొండల్, యాదయ్య, పాండు, రాములు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన

యాచారం: మండల పరిధిలోని తాడిపర్తి గ్రామంలో గ్రంథాలయ నూతన భవన నిర్మాణ పనులకు మంగళవారం గ్రామ సర్పంచ్ రమేష్ శంకుస్థాపన చేశారు. ఎస్‌ఆర్‌ఐ, అమెజాన్ ఆర్థిక సహకారంతో రూ.15 లక్షల నిధులతో భవన నిర్మాణం చేపట్టనున్నారు. గ్రామాభివృద్ధిలో దాతలు భాగస్వాములు కావాలని సర్పంచ్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ నిర్మల, వార్డు సభ్యుడు రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆహ్వాన పత్రిక అందజేత



ఆహ్వానపత్రిక అందజేస్తున్న కృష్ణనాయక్

తలకొండపల్లి: సంత్ సేవాలాల్ జయంతి వేడుకలను ఫిబ్రవరి 12న హైదరాబాద్ బంజారా భవన్‌లో లంబాడీ ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. లంబాడీ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్‌కుమార్ జాదవ్ పిలుపు మేరకు మండల పరిధిలోని హర్యానాయక్ తండాకు చెందిన లంబాడి ఐక్యవేదిక మండల కోఆర్డినేటర్ కృష్ణ నేతృత్వంలో నాయకులు.. జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్‌ను హైదరాబాద్‌లో మంగళవారం కలిశారు. జయంతి వేడుకలకు రావాలని ఆహ్వానపత్రిక అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు గోపాల్‌నాయక్, లక్ష్మణ్‌నాయక్, కృష్ణనాయక్, తావుర్యా, కుమార్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మట్టి అక్రమ రవాణాను అరికట్టండి

- మండల సర్వసభ్య సమావేశంలో సభ్యుల డిమాండ్
- రోడ్డు విస్తరణలో దుకాణాలు కోల్పోయిన వారికి ఇళ్ల స్థలాలు: తహసీల్దార్
- పంచాయతీలకు నిధులు విడుదల చేయాలి: సర్పంచుల వినతి
- మండల అభివృద్ధే లక్ష్యం: ఎంపీపీ రఘుమారెడ్డి



మాట్లాడుతున్న ఎంపీపీ రఘుమారెడ్డి

మహేశ్వరం: మండలంలోని ప్రభుత్వ, అసైన్డ్ భూముల్లో యథేచ్ఛగా సాగుతున్న మట్టి తవ్వకాలు, అక్రమ రవాణాను నియంత్రించాలని ప్రజాప్రతినిధులు డిమాండ్ చేశారు. మంగళవారం మహేశ్వరం ఎంపీడీఓ సమావేశ మందిరంలో ఎంపీపీ కోరుపోలు రఘుమారెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచులు, ఎంపీటీసీలు వారివారి గ్రామాల్లో నెలకొన్న సమస్యలను సభ దృష్టికి తెచ్చారు. తుమ్మలూరు, నాగిరెడ్డిపల్లి గ్రామాల్లో రాత్రి వేళల్లో ప్రభుత్వ, అసైన్డ్ భూముల్లో అధికార పార్టీకి చెందిన నేతలు, కొంత మంది వ్యాపారులు యథేచ్ఛగా మట్టిని తవ్వి అక్రమ రవాణా చేస్తున్నారని తుమ్మలూరు ఎంపీటీసీ మద్ది రామిరెడ్డి సభలో లేవనెత్తారు. స్పందించిన తహసీల్దార్ మహమూద్ అలీ మట్టి తవ్వకాలు జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామ పంచాయతీల్లోని పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలు ఇవ్వడం లేదని, తాము అప్పులు చేసి కార్మికులకు వేతనాలు, పలు అభివృద్ధి పనులు చేస్తున్నామని మాణిక్యమ్మగూడ సర్పంచ్ మాసారం చంద్రయ్య గౌడ్ అన్నారు. స్పందించిన ఎంపీడీఓ నర్సింహ రెండు నెలల్లో పంచాయతీలకు నిధులు విడుదలవుతాయన్నారు. మండల కేంద్రం మహేశ్వరంలో రోడ్డు విస్తరణ కారణంగా దుకాణాలు పోయిన వారికి ఇళ్ల స్థలాలు ఇవ్వాలని మహేశ్వరం ఎంపీటీసీ పోతర్ల సుదర్శన్ యాదవ్ కోరారు. త్వరలో బాధితులందరికీ ఇళ్ల స్థలాలు ఇస్తామని తహసీల్దార్ హామీ ఇచ్చారు. అంబేడ్కర్ భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని కోళ్లపడకల్ ఎంపీటీసీ హన్మగళ్ల చంద్రయ్య కోరగా.. స్థల పరిశీలన చేస్తున్నామని తహసీల్దార్ తెలిపారు. అమీర్‌పేట్, కల్వకోల్, పెండ్యాల గ్రామాలను కలిపే రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని అమీర్‌పేట్ సర్పంచ్ బస్వ శ్రీశైలం గౌడ్ కోరారు. ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభిస్తామని ఆర్‌అండ్‌బీ ఏఈ శ్రీహరి తెలిపారు. మహేశ్వరంలో పందులు స్వైర విహారం చేస్తున్నాయని పలుమార్లు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదని మండల కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ ఆదిల్ అలీ ఆరోపించారు. అలాగే మోడల్ స్కూల్ వద్ద, మహేశ్వరం – మన్సాన్‌పల్లి మార్గంలో డివైడర్లు ఏర్పాటు చేయడంతోపాటు రేడియం స్టిక్కర్లు వేయాలని కోరారు. త్వరలో పందుల సమస్యను పరిష్కరిస్తామని ఎంపీడీఓ నర్సింహ హామీ ఇచ్చారు. గ్రామాల్లో యథేచ్ఛగా బెల్టుషాపులు నడుస్తున్నాయని, వాటిని నియంత్రించాలని ఎంపీడీసీ చంద్రయ్య, సర్పంచులు చంద్రయ్య గౌడ్ ఎక్సైజ్ సీఐకి సూచించారు. బెల్టు షాపులు నిర్వహించే వారిపై కేసులు నమోదు చేసి బైండోవర్ చేస్తామని ఎక్సైజ్ సీఐ వీణారెడ్డి తెలిపారు. డబిల్‌గూడ చౌరస్తా నుంచి డబిల్‌గూడ గ్రామం వరకు రోడ్డు గుంతలమయంగా మారి రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారిందని, రోడ్డు మరమ్మతులకు నిధులు మంజూరైనా ఇప్పటివరకు పనులు ప్రారంభం కాలేదని స్థానిక సర్పంచ్ బుగ్గని శంకర్ ఆరోపించారు. త్వరలో రోడ్డు మరమ్మతు పనులు ప్రారంభిస్తామని పంచాయతీరాజ్ ఏఈ అనిల్‌కుమార్ తెలిపారు. మహేశ్వరం – పులిమామిడి రోడ్డు నిర్మాణ పనులు ఆగిపోయి రెండేళ్లు కావస్తున్నా ఎందుకు పూర్తి చేయడం లేదని ఎంపీటీసీ సుదర్శన్ ప్రశ్నించారు. కాంట్రాక్టర్‌తో మాట్లాడి త్వరలో పనులు పూర్తయ్యేలా చూస్తామని ఏఈ అనిల్‌కుమార్ తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాలపై ప్రజలకు అవగాహన సదస్సులు నిర్వహించాలని నాగిరెడ్డిపల్లి సర్పంచ్ మనోహర్ పేర్కొన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు నిర్వహిస్తామని సీడీపీఓ షబానా తెలిపారు. అమీర్‌పేట్, నాగారం గ్రామాల్లో రోడ్డు మధ్యలో డివైడర్లు ఏర్పాటు చేయాలని సర్పంచ్ కుండె వెంకటేష్, సర్పంచ్ బస్వ శ్రీశైలం గౌడ్ కోరారు. ఆర్‌అండ్‌బీ రోడ్లకు మధ్యలో డివైడర్లు ఏర్పాటు చేయడానికి అవకాశం లేదని, రేడియం స్టిక్కర్లు అతికిస్తామని ఏఈలు సరిత, చంద్రశేఖర్, శ్రీహరి తెలిపారు. మండలంలో నెలకొన్న పలు సమస్యలను సభ్యులు సభలో ప్రస్తావించగా సంబంధిత అధికారులు వివరణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. మండల అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తామన్నారు. మంత్రి సబితారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి సహకారంతో ఈ ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేసి ఆదర్శ మండలంగా తీర్చిదిద్దుతామన్నారు. సమావేశానికి పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు గైర్హాజరయ్యారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సునితా నాయక్, మహేశ్వరం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సురసాని సురేందర్ రెడ్డి, సహకార సంఘం చైర్మన్ మంచె పాండు యాదవ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

‘గ్రీన్ జోన్‌ను ఎత్తివేయండి’

బడంగ్‌పేట్: గ్రీన్ జోన్‌ను ఎత్తివేసి కాలనీవాసులకు విముక్తి కల్పించాలని కోరుతూ.. అల్మాస్‌గూడకు చెందిన యూత్ కాంగ్రెస్ మహేశ్వరం నియోజకవర్గ అధ్యక్షుడు బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి ముఖ్యమంత్రి కేసీఆర్‌కు లేఖ రాశారు. బడంగ్‌పేట కార్పొరేషన్ అల్మాస్‌గూడలోని ఎస్‌ఆర్ హిల్స్, శ్రీహిల్స్ ఫేజ్–2, తిరుమలనగర్ కాలనీ, శ్రీసాయిహోమ్స్, హనుమాన్‌నగర్, వెంకటేశ్వర కాలనీ, వెంకటరమణ కాలనీ, విశాఖనగర్ ఫేజ్– 1, 2, ఎంఆర్‌ఆర్ కాలనీలు గ్రీన్ జోన్ పరిధిలో ఉన్నాయని గ్రీన్ జోన్‌ను ఎత్తివేయాలని లేఖ ద్వారా విన్నవించారు. గ్రీన్ జోన్ పేరుతో కోట్లాది రూపాయల మోసపు వ్యాపారాలు సాగుతున్నాయని, ఎంతోమంది అమాయక పేదలు ఈ ఉచ్చులో చిక్కుకుంటున్నారని పేర్కొన్నారు.

ఎలమ్మ తల్లికి ప్రత్యేక పూజలు



తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని సూర్యగిరి ఎల్లమ్మ దర్శనానికి మంగళవారం భక్తులు పోటెత్తారు. అమ్మవారికి ప్రీతియైన రోజు అవ్వడంతో భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆ ఆలయ ఫౌండర్ ట్రస్టీ చైర్మన్ రెడ్డిగళ్ల రత్నం, సిబ్బంది కాశీనాథ్, భక్తులు పాల్గొన్నారు.

అధిక పన్నులు, బిల్లులు తగ్గించాలి

బీజేపీ కార్పొరేషన్ అధ్యక్షుడు నర్సింహా

మీర్‌పేట: మీర్‌పేట కార్పొరేషన్‌లో అధిక ఇంటి పన్నులు, నల్లా బిల్లులను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ కార్పొరేటర్లు, నాయకులు మంగళవారం కమిషనర్ సిహెచ్.నాగేశ్వర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేషన్ పార్టీ అధ్యక్షుడు పెండ్యాల నర్సింహ, ఫ్లోర్‌లీడర్ కీసర గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ధనికులు నివాసముండే జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ వంటి ప్రాంతాలలో మాదిరిగా పేదలు నివసించే మీర్‌పేట ప్రాంతంలో ఒకేలా పన్నులు వసూలు చేయడం సరికాదన్నారు. అధిక పన్నులతో మీర్‌పేట ప్రాంత ప్రజలు ఇబ్బందులు పడుతున్నందున, కొత్త పన్నుల విధానాన్ని నిలిపివేసి పాత పద్ధతి ద్వారా పన్నులు వసూలు చేయాలని కోరారు. దీంతో పాటు కార్పొరేషన్‌లో 250గజాల ఇంటికి, 60గజాల ఇంటికి సమానంగా ఒకే బిల్లు వసూలు చేస్తున్నారని కమిషనర్‌కు వివరించారు. వెంటనే ఇంటి పన్నులు, నల్లా బిల్లులను తగ్గించాలని, లేకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మీర్‌పేట కార్యదర్శులు కోడూరు సోమేశ్వర్, గాజుల మధు, నాయకులు మద్ది రాజశేఖర్‌రెడ్డి, ఆర్.యాదగిరి యాదవ్, బచ్చనమోని నర్సింహ, ఆవుల సత్తయ్య, తిరుపతిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



కమిషనర్ నాగేశ్వర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ కార్పొరేటర్లు, నాయకులు

ఉపాధ్యాయుల సమస్యను పరిష్కరిస్తాం

పీఆర్టీయూ ఎమ్మెల్సీ అభ్యర్థి చెన్నకేశవరెడ్డి

కందుకూరు: పీఈటీ, పండిట్ ఉపాధ్యాయుల సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని పీఆర్టీయూ ఎమ్మెల్సీ అభ్యర్థి గుర్రం చెన్నకేశవరెడ్డి హామీ ఇచ్చారు. మంగళవారం ఆయన మండల పరిధిలోని గూడూరు, రాచులూరు, తిమ్మాపూర్, ఆకుల మైలారం, మీర్‌ఖాన్‌పేట, ముచ్చర్ల జెడ్పీహెచ్‌ఎస్‌లను పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు కన్నయ్యగారి గోవర్ధన్‌యాదవ్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకే ఓటు వేయాలని ఉపాధ్యాయులను కోరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సీపీఎస్ ఉపాధ్యాయులకు అండగా ఉండి వారి తరపున పోరాడుతామన్నారు. 317 జీఓ ద్వారా భవిష్యత్‌లో ఖాళీల ద్వారా వారిని సొంత జిల్లాకు తీసుకువచ్చేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ మండల అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, గౌరవ అధ్యక్షుడు శ్రీనివాస్‌గుప్తా, ప్రధానకార్యదర్శి నాగేందర్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు రాంభూపాల్‌రెడ్డి, ఆ సంఘం నాయకులు ప్రతాప్‌రెడ్డి, సుభాశ్‌రెడ్డి, బళ్లారి శ్రీనివాస్, వేణుగోపాల్, శేఖర్‌రెడ్డి, వెంకట్‌రాంరెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, రాఘవేందర్, తిరుమలేశ్, వెంకటేశం, రాజేశ్వర్, చిందం వెంకట్, వెంకటస్వామి, జంగయ్య, హరిప్రసాద్ పాల్గొన్నారు.



తిమ్మాపూర్ జెడ్పీహెచ్‌ఎస్‌లో ప్రచారం చేస్తున్న చెన్నకేశవరెడ్డి తదితరులు

వీధి దీపాలు వెలిగేదెన్నడో..!

- ఎనిమిది నెలలు గడుస్తున్నా పట్టించుకోని అధికారులు
- ఇబ్బందులు పడుతున్న జనం

కందుకూరు: జాతీయ రహదారిపై వీధిదీపాలు ఏర్పాటు చేసి నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు వాటిని ప్రారంభించలేదు. దీంతో నిత్యం చీకట్ల మధ్యనే అక్కడ వ్యాపారాలు కొనసాగుతున్నాయి. మంత్రి సబితారెడ్డి ఆదేశించినా సంబంధిత అధికారులు పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఇది మండల కేంద్రంలోని శ్రీశైలం-హైదరాబాద్ జాతీయ రహదారిపై పరిస్థితి.

నిరుపయోగంగా..

శ్రీశైలం-హైదరాబాద్ జాతీయ రహదారిపై నేషనల్ హైవే అథారిటీ ఆధ్వర్యంలో కందుకూరుతో పాటు కడ్తాల్, ఆమనగల్లు, విఠాయిపల్లి, వెల్దండ, కల్వకుర్తి, దిండి తదితర ప్రాంతాల్లోని ప్రధాన చౌరస్తాల్లో ఎనిమిది చోట్ల రూ.4.92 కోట్ల నిధులతో వీధి దీపాలు ఏర్పాటు చేశారు. ఆయా ప్రాంతాల్లోని పలు చోట్ల ప్రారంభించడంతో వెలుగులు విరజిమ్ముతూ ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి. కాగా, కందుకూరు చౌరస్తాలో వీధి దీపాలు ఏర్పాటు చేసి ఎనిమిది నెలలు గడుస్తుంది. ఇంకా ప్రారంభించలేదు. ప్రధాన చౌరస్తా కావడంతో నిత్యం ఆ ప్రాంతంలో జన సంచారం అధికంగా ఉంటుంది. రోడ్డుకి ఇరువైపులా వ్యాపార సముదాయం ఉండడంతో అటు వ్యాపారులు, ఇటు కొనుగోలుదారుల రాత్రి వేళల్లో ఇబ్బందులు పడుతున్నారు. దుకాణాల్లోని లైట్ల వెలుగుతోనే నెట్టుకొస్తున్నారు. కనెక్షన్ ఇవ్వడానికి మాత్రం అధికారులు మొగ్గు చూపడంలేదు. ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.



అంధకారంలో ప్రధాన చౌరస్తా

వారం రోజుల్లో పరిష్కారం

కందుకూరు నుంచి దిండి వరకు శ్రీశైలం రహదారిపై మధ్యలో ఉన్న ప్రాంతాల్లో వీధి దీపాలకు కనెక్షన్, ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకు సంబంధిత శాఖ పేరుతో డీడీ రూ.28 లక్షలు తీయడం జరిగింది. ఎస్‌ఈ కార్యాలయంలో అందజేయనున్నాం. వారం రోజుల్లో సమస్య పరిష్కారం కానుంది.

–గంగాధర్‌రావు, ఇంజనీర్, నేషనల్ హైవే

‘డబుల్’ ఇళ్లు స్థానికులకే..

సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రవికుమార్ డిమాండ్

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని సర్దార్‌నగర్, మంఖాల్ గ్రామంలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లను ముందుగా స్థానికులకే కేటాయించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎ.రవికుమార్ అన్నారు. మంగళవారం మున్సిపాలిటీ కార్యాలయం వద్ద సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... డబుల్ బెడ్రూం ఇళ్లను జీహెచ్‌ఎంసీ పరిధి వారికి కేటాయిస్తే సహించేది లేదన్నారు. మహేశ్వరం మండల పరిధిలో ఉన్న నిరుపేదలకు అందజేయలన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు ప్రకాశ్, పరమేశ్, యాదయ్య, సాయికుమార్, వెంకటేశ్, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న సీఐటీయూ నాయకులు

‘కంటి వెలుగు’ను వినియోగించుకోండి



దెబ్బడగూడలో కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

కందుకూరు: కంటి వెలుగు పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని దెబ్బడగూడ సర్పంచ్ ఎ.శ్రావణి, ఎంపీటీసీ ఎ.లక్ష్మీ, ఉప సర్పంచ్ గణేశ్ సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న కంటి వెలుగు కార్యక్రమం శిబిరం మంగళవారం మండల పరిధిలోని దెబ్బడగూడలో ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రతి ఒక్కరు తమ కళ్లను పరీక్షించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారిణి డాక్టర్ రాధిక, శిబిరం అధికారి డాక్టర్ సౌమ్య, కోఆప్షన్ సభ్యుడు ఎండీ సులేమాన్, వార్డు సభ్యులు జంగయ్య, యాదమ్మ, రమాదేవి, అలివేలు, పంచాయతీ కార్యదర్శి పురుషోత్తంరెడ్డి, కారోబార్లు ఎండీ వహీద్, పెద్ద బాల్‌రెడ్డి, సీహెచ్ఓ కె.రవీందర్, పీఎం కె.శ్రీనివాస్, పీహెచ్‌ఎన్ భారతి, ఏఎన్‌ఎంలు నిఖిత, పార్వతి, ఎంపీహెచ్ఏ సైదులు, యాదగిరి, సీసీ నర్సింహ, ఆశ వర్కర్లు చంద్రకళ, యాదమ్మ, వీఓలు రాధ, ఉమ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

ఇబ్రహీంపట్నం రూరల్: ఆంగ్ల భాష పరిజ్ఞానంపై జరగబోయే రాష్ట్రస్థాయి పోటీలకు ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని ఎంపీపటేల్‌గూడ ప్రభుత్వ పాఠశాల విద్యార్థి కె.జస్వంత్ ఎన్నికయ్యాడు. ఇంగ్లిష్ స్టోరీ టెల్లింగ్‌లో రంగారెడ్డి జిల్లా స్థాయిలో జరిగిన పోటీలో జస్వంత్ ద్వితీయ బహుమతి సాధించాడు. ఫిబ్రవరి 13న వరంగల్‌లో జరగబోయే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన సందర్భంగా గైడ్ టీచర్ సోలమన్, విద్యార్థి జస్వంత్‌లను పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు వరకాల పరమేష్, ప్రధానోపాధ్యాయులు గోవర్ధన్, యాదగిరిరెడ్డి మెడల్స్‌తో సత్కరించారు.

ఆరుట్లను మరింత అభివృద్ధి చేస్తాం

ప్రగతి నివేదన యాత్రలో ప్రశాంత్‌కుమార్‌రెడ్డి

మంచాల: బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతు ప్రభుత్వమని ఆ పార్టీ యువనేత మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఆయన చేపట్టిన ప్రగతి నివేదన యాత్ర మంగళవారం మండల పరిధిలోని చెన్నారెడ్డిగూడ, ఆరుట్ల గ్రామాల్లో కొనసాగింది. ప్రశాంత్‌కుమార్ రెడ్డి ఇంటింటికి తిరిగి ప్రజాసమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని ఆరా తీసారు. ఇబ్రహీంపట్నం నుండి ఆరుట్ల వరకు రూ.17 కోట్లతో డబుల్ రోడ్డు వేయడం జరిగిందన్నారు. ఆరుట్ల గ్రామంలో సీసీ రోడ్డు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఇతర అభివృద్ధి కార్యక్రమాల కోసం ఇప్పటివరకు బీఆర్‌ఎస్ సర్కార్ రూ.1.67 కోట్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి సహకారంతో ఆరుట్ల గ్రామాన్ని మరింత అభివృద్ధి చేస్తామన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ చంద్రయ్య, మండల అధ్యక్షుడు చీరాల రమేష్, ప్రధాన కార్యదర్శి బహదూర్, ఎంపీటీసీ సభ్యులు కావలి శ్రీనివాస్, పరంగ, మార్కెట్ కమిటీ డైరెక్టర్ జానీపాషా, వార్డు సభ్యుడు సద్దాంహుసేన్, నాయకులు సికిందర్‌రెడ్డి, శ్రీశైలం, వెంకటేశ్, సతీష్, వినోద్ పాల్గొన్నారు.

అన్నివర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

కడ్తాల్: అన్నివర్గాల సంక్షేమమే బీఆర్‌ఎస్ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. మండల పరిధిలోని రేఖ్యతండా పంచాయతీలో రూ.20 లక్షలతో నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులకు, సీసీరోడ్డు నిర్మాణ పనులకు ఎంపీపీ కమ్లీమోత్యానాయక్, జెడ్పీటీసీ దశరథ్‌నాయక్‌తో కలిసి మంగళవారం ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. నియోజకవర్గంలోని వివిధ గ్రామాల్లో సీసీరోడ్ల నిర్మాణానికి రూ.13.89 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. దీంతోపాటు నియోజకవర్గంలోని 44 గ్రామ పంచాయతీ నూతన భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు అయ్యాయన్నారు. కడ్తాల్ మండలంలో 9 గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణాలకు ఒక్కో భవన నిర్మాణానికి రూ.20 లక్షల చొప్పున నిధులు విడుదలయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ వెంకటేశ్‌గుప్త, రైతుబంధు మండల అధ్యక్షుడు వీరయ్య, సర్పంచ్‌లు సులోచన, హరిచంద్, ఎంపీటీసీ మంజుల, మార్కెట్ కమిటీ డైరెక్టర్ నర్సింహ, ఉప సర్పంచ్‌లు రామకృష్ణ, ముత్యాలు, నాయకులు కోట్యా, రాములునాయక్, ఏఈ పరమేశ్ ఉన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

కడ్తాల్: మండల కేంద్రానికి చెందిన సాయికుమార్‌కు రూ.28 వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు మంజూరయ్యింది. ఈ మేరకు మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బాధిత కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ చెక్కు అందజేశారు. జెడ్పీటీసీ దశరథ్‌నాయక్, సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్‌గుప్త, ఉప సర్పంచ్ రామకృష్ణ, నాయకులు జైపాల్‌రెడ్డి, రాజేందర్‌యాదవ్, బీక్యా నాయక్ ఉన్నారు.

విజయకుమార్‌కు ‘కబీర్ కోహినూర్’

వనస్థలిపురం: తెలంగాణ హిందీ కవి, వనస్థలిపురంకు చెందిన గుండాల విజయకుమార్‌కు కబీర్ కోహినూర్ అవార్డు లభించింది. హిందీ సాహిత్యంలో విశేష ప్రతిభకు గానూ ఈ పురస్కారం దక్కింది. దేశం మొత్తంగా అన్ని రాష్ట్రాల నుంచి 100 మందికి పైగా ఈ అవార్డుకు ఎంపిక చేయగా తెలంగాణ ప్రాంతం నుంచి విజయకుమార్‌కు ఈ అవకాశం దక్కింది. ఇటీవల దేశ రాజధాని ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో కబీర్ దాస్ సంస్థ వ్యవస్థాపకుడు భరత్‌భూషణ్ మహంతి, డాక్టర్ నానక్‌దాస్ మహారాజ్, బలక్ నాయజి మహారాజ్, విశ్వ శాంతి దూత ఆచార్య డాక్టర్ లోకేష్ ముని జీ మహారాజ్‌లు అవార్డును అందజేశారు.

కనుల పండువగా ప్రత్యంగిరాదేవి బ్రహ్మోత్సవాలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు



కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురంలోని కుర్తాళం పీఠ విభాగ ఆది పరాశక్తి శ్రీ ప్రత్యంగిరా ఆలయ బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం అమ్మవారు ప్రత్యేక కుంకుమ అలంకారంలో దర్శనమిచ్చారు. వేలాదిగా తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. మహానక్షత్ర హారతి, యాగ మండప దేవాతా హోమాలు నిర్వహించారు. మహిళలచే ప్రత్యేక కుంకుమార్చన నిర్వహించారు. కుర్తాళం పీఠాధిపతులు శ్రీ సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి ‘వర్చువల్’ ద్వారా అనుగ్రహ భాషణం చేశారు. ఈ సందర్భంగా సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి మాట్లాడుతూ... భారతీయ సంస్కృతిని, సంప్రదాయలను కాపాడుకోవాలని బాధ్యత అందరిపై ఉందన్నారు. అత్యంత ప్రాచీన, అతి శక్తిమంతమైన శ్రీప్రత్యంగిరా పరమేశ్వరీ ఆదిపరాశక్తి ప్రత్యేక రూపమని తెలిపారు. అమ్మవారి పూజించిన సాధకులకు, శత్రువులు ఎంతటి ప్రయోగం చేసినా నివారించడమే కాక తిరిగి శత్రువు పైకి పంపించే శక్తి అమ్మవారికి ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆలయ సెక్రటరీ మునిపల్లె శ్రీనివాస్, మాచవోలు రమేష్ శర్మ, విట్టల్ శర్మ, సాయి కుమార్ శర్మ, గోపాలకష్ణ, రామశర్మ తదితరులు పాల్గొన్నారు.

నేడు అన్నాభిషేకం సాయంత్రం పల్లకి సేవ...

అమ్మవారికి బుధవారం ఉదయం 10 గంటలకు అన్నాభిషేకం, సాయంత్రం 6 గంటలకు అమ్మవారి పల్లకీ సేవ ఊరేగింపు నిర్వహించనున్నట్లు ఆలయ సెక్రటరీ మునిపల్లె శ్రీనివాస్ తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగు ఏర్పాట్లు చేశామన్నారు.